


గేటు తొలగించకుంటే ఆత్మహత్యలే...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చిందేపల్లి రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన గేటును తొలగించకుంటే ల్యాంకో యాజమాన్యం ఆత్మహత్యలు చేసుకుంటామని ఆ ఊరి గ్రామస్తులు హెచ్చరించారు. చిందేపల్లి గ్రామస్తులు శుక్రవారం పురుగుమందు బాటిళ్లతో నిరసన తెలిపారు. అధికారులు వెంటనే రోడ్డు సమస్యను పరిష్కరించకుంటే ఆత్మహత్య చేసుకుంటామని స్పష్టం చేశారు. అనాదిగా వాడుకలో ఉన్న చిందేపల్లి రోడ్డు ను ల్యాంకో యాజమాన్యం దౌర్జన్యంగా అడ్డగించి గేటు ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడటం ఎంతవరకు సబబని అన్నారు. పైగా మా పైనే కేసులు పెట్టి స్టేషన్ కు తరలించారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిందేపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.



పురుగుమందులతో చిందేపల్లి రైతులు

విద్యార్థుల భవితతో చెలగాటం

- మూడేళ్లుగా విడుదల కాని పరీక్షా ఫలితాలు
- పాఠాలు చెప్పడమూ మానేశారు
- ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో దుస్థితి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు విద్యార్థుల భవితతో చెలగాటం ఆడుతున్నారు. ఈ కళాశాలలో మూడేళ్లుగా పరీక్ష ఫలితాలు విడుదల చేయలేదు. చివరి సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్పడమూ మానేశారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఇలా అయితే తమ భవిష్యత్తు ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే...

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ కళాశాలలో విద్య అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థుల నమ్మకం. ఇక్కడ విద్య అభ్యసించిన విద్యార్థులు చాలా మంది ఎంతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అందుకే ఎంసెట్‌లో మంచి ర్యాంకులు తెచ్చుకునే విద్యార్థులు ఈ కళాశాలలో చేరుతుంటారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంతో తెలివైన విద్యార్థులు ఇక్కడకు వస్తుంటారు. ఇందుకు కారణం ఈ కళాశాలపై ఉన్న నమ్మకం. అయితే ఇటీవల కాలంలో ఈ కళాశాల ప్రతిష్ట దిగజారి పోతోంది. అధికారుల తీరుతో నాక్ గ్రేడ్ కూడా దిగజారి పోయింది. ప్రతి నెలా రూ.లక్షల వేతనాలు తీసుకునే ప్రొఫెసర్లు పాఠాలు చెప్పడం పూర్తిగా మానేశారు. కోవిడ్ కారణంగా దాదాపు రెండేళ్లు ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు సక్రమంగా చెప్పలేదు. విద్యార్థులు ఏడు సంవత్సరం కోల్పోతారనే కారణంగా వరుసగా పరీక్షలు నిర్వహించారు. అయినా విద్యార్థులు ఎంతో శ్రమకు ఓర్చి పరీక్షలు రాశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తరువాత విద్యార్థులను కళాశాలకు రప్పించారు. విద్యార్థులు అందుబాటులో ఉన్నప్పటికీ సక్రమంగా పాఠాలు బోధించడం లేదు.



ప్రొఫెసర్లకు తీరిక ఉన్నప్పుడు మాత్రమే తరగతులకు వస్తున్నారు. లేదంటే తమ సహాయకులను తరగతులకు పంపుతారు. మిగిలిన సందర్భాల్లో విద్యార్థులను గాలికి వదిలేయడం వీరి అలవాటు. పాఠాలు చెప్పక పోయినా పరీక్షలు మాత్రం యథాతథంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ కారణంగా సొంతంగా చదువుకుని పరీక్షలు రాయాల్సి వస్తోంది. ల్యాబ్ ల నిర్వహణ కూడా చాలా అధ్వాన్నంగా ఉంది. ఇలా అయితే తమకు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎలా వస్తుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం కళాశాల వారికి తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

రెండేళ్లుగా విడుదల చేయని పరీక్షా ఫలితాలు

తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో రెండేళ్లుగా పరీక్ష ఫలితాలు విడుదల చేయలేదు. ఇందుకు కారణం ఏమో అధికారులకే తెలియాలి. సాధారణంగా జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు పూర్తి కాగానే నెల రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేస్తున్నారు. ఫలితాలు విడుదల చేశాకే వేరే సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో మాత్రం ఫలితాలు విడుదల చేయకుండానే పరీక్షలు నిర్వహిస్తుంటారు. వీరి పరిస్థితి ఎలా ఉంటుందంటే సెమిస్టర్ పరీక్ష ఫలితాలు పక్కన పెడితే... మధ్యంతర (మిడ్) పరీక్ష ఫలితాలు కూడా మూడేళ్లుగా వీరు విడుదల చేయలేదు.

పాఠాలు బోధించకుండానే...

శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో గత నెలలో బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ తరువాత ఆన్ లైన్ లో తరగతులు బోధిస్తామని విద్యార్థులకు చెప్పారు. తమ ప్రొఫెసర్ల మాట విద్యార్థులు నమ్మారు. అయితే నెల రోజులు దాటి పోయినా తరగతులు మాత్రం బోధించ లేదు. పాఠాలు చెప్పకుండానే ఈ నెల రెండవ వారంలో మధ్యంతర (మిడ్) పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు అతికష్టం మీద సిలబస్ తెలుసుకుని... వారే సొంతంగా చదువుకుని మిడ్ పరీక్షలు రాశారు. వీరికి మళ్లీ త్వరలో రెండవ మిడ్ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాఠాలు చెప్పకుండా... పాఠ్యాంశాలు తెలియకుండా తాము పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ కళాశాల అధికారులు ఇకనైనా స్పందించి పెండింగ్ లో ఉన్న పరీక్షా ఫలితాలు విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని తరగతులు బోధించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


వైసిపిలో అంతర్మథనం

వెంకటగిరి ఎంఎల్‌ఎపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అసెంబ్లీ నుంచి 'స్థానిక', 'పురపాలిక' ఎన్నికల వరకూ తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకున్న వైసిపి ఇటీవల జరిగిన వైసిపి ఎన్నికల్లో కోలుకోలేని ఓటమిని చవిచూసింది. అన్ని ఎన్నికల్లానే సునాయాసంగా 'డబ్బు', 'సంక్షేమ పథకాలు' గెలిపిస్తాయని భావించిన ఆ పార్టీకి ఊహించనిరీతిలో ఎదురుదెబ్బ తగిలింది. దీంతో జిల్లాలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు తలలు పట్టుకునే పరిస్థితి. ఏడాదిగా లేని సాధారణ ఎన్నికల్లో ఈ అపజయాన్ని ఎలా ఎదుర్కోవాలోనని అంతర్మథనం భావించింది. ఎంఎల్‌ఎ కోటాలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ఊహించని రీతిలో క్రాస్ ఓటింగ్ జరిగి టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయాన్ని కైవసం చేసుకుంది. నలుగురు ఎంఎల్‌ఎలు క్రాస్ ఓటింగ్ చేశారని 'ఆపరేషన్'లో బయటపడడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇందులో తిరుపతి జిల్లా వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రాంనారాయణరెడ్డి ఉన్నారు. ఎప్పటినుంచో జిల్లాలో తిరుగుబాటు బావుటా ఎగురవేటు వేస్తున్న ఆయన ఈ ఎన్నికల్లో తన అసంతృప్తిని ఓటు రూపంలో వెళ్లగక్కడం గమనార్హం.

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆనంతో సహా ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ముగ్గురు ఎంపిలను, 13 మంది ఎంఎల్‌ఎలను భారీ మెజార్టీతో గెలిపించుకుని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు చుక్కలు చూపించారు. కుప్పంలోనూ మెజార్టీని తగ్గించడమే గాకుండా, మున్సిపల్ ఎన్నికల్లోనూ వైసిపి జెండా ఎగురవేశారు. బల్లి దుర్గాప్రసాద్ మృతితో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. ఇందులోనూ పెద్దిరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారు. పంచాయతీ, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లోనూ అత్యధికంగా ఏకగ్రీవానికి ప్రయత్నించారు. స్థానిక సంస్థల్లో వైసిపి విజయఢంకా మోగించింది. పట్టభద్రులు, టీచర్ల ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ అదే ఒరవడిని కొనసాగించారు. దొంగ ఓట్లను సృష్టించారు. కోట్లల్లో ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ రోజు రిగ్గింగ్‌కూ పాల్పడ్డారు. వైసిపి, పిడిఎఫ్ మధ్యే ఈ ఎన్నికల్లో పోటీ ఉంటుందని టిడిపి సైతం భావించింది. అయితే ఊహించని రీతిలో పట్టభద్రులు టిడిపికి అత్యధిక మెజార్టీని కట్టబెట్టారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సిల్లోనూ అతి తక్కువ ఓట్లతో పీడిఎఫ్‌పై వైసిపి గట్టెక్కింది. ఇక ఎంఎల్‌ఎ ఎన్నికల్లోనూ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన శాసనసభ్యుల్లో తిరుపతి జిల్లా వెంకటగిరి ఎంఎల్‌ఎ ఉండటం గమనార్హం.

పీజీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

ఎస్వీయూ అధికారుల సాక్షిగా...

- గేటుకు తాళాలు వేసి మరీ చూసిరాత
- 'పాస్ గ్యారంటీ' పేరుతో వేలల్లో ఫీజులు

ప్రజాశక్తి - పుంగనూరు

పరీక్ష రాస్తున్న వారంతా పీజీ విద్యార్థులు.. పుస్తకాలు పెట్టుకుని మరీ చూసిరాసుకుంటున్నారు.. ఎస్వీయూ అధికారుల సాక్షిగా మాస్‌కాపీయింగ్ 'సూపర్'గా జరుగుతోంది. కాలేజీ యాజమాన్యం గేటుకు బీగాలు వేసి మరీ సహకరిస్తోంది.. ఇది మన ఉన్నత విద్యా విధానం.. 'పాస్ గ్యారంటీ' పేరుతో ఉన్నతాధికారులే మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఇదేమని మీడియా ప్రశ్నించగా 'మాకు ఎంపి అండదండలు పుష్కలంగా ఉన్నాయి.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం గమనార్హం.

ఒకటో తరగతో...రెండో తరగతో కాదు...భవిష్యత్తులో అధ్యాపకులు, ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దే పోస్టుగ్రాడ్యుయేట్ పరీక్షలను ఓ కాలేజీ యాజమాన్యం చూచిరాతగా మార్చేసింది. అభ్యర్థుల నుంచి పాస్ గ్యారంటీ అని రూ.వేలల్లో ఫీజులు వసూళ్లు చేసిన కాలేజీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా అభ్యర్థులను పరీక్షల్లో మాస్ కాపీయింగుకు పాల్పడేలా చేస్తోంది. రాయచోటికి చెందిన కొందరు వ్యక్తులు పట్టణంలోని కొత్తపేట క్రాస్ వద్ద ఉన్న హెచ్‌ఎం డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోస్టుగ్రాడ్యుయేట్ ఎంఎ, ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం పరీక్షలను దూర విద్యా విధానం ద్వారా నిర్వహిస్తున్నారు. ఎస్వీ యూనివర్శిటీ ద్వారా రాయిస్తున్నారు. వారం రోజులుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. 200 మందికి గాను ప్రతి రోజూ 180మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ పరీక్షల నిర్వహణ చూస్తే తరగతి గదిలో విద్యార్థులు క్లాసులో ఉన్నట్టుగా ఉంది కానీ పరీక్షలు రాసే విధంగా కనబడడం లేదు. రెండు రోజుల్లో ఈ పరీక్షలు ముగియనున్నాయి. మాస్ కాపీయింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న మీడియా అక్కడికి వెళ్లడంతో వారి బండారం బయటపడింది. గేటుకు రెండు వైపులా తాళాలు వేసి ఎవరిని లోపలికి రానివ్వకుండా గేటు వద్దే వారి అనుచరులను కాపల పెట్టారు. రేకుల షెడ్డులో ఇరుకైన గదిలో సుమారు 45నుండి 50మంది వరకు పరీక్షలు రాస్తున్నారు .పక్కపక్కనే టేబుల్కు ఇద్దరు, ముగ్గురు చొప్పున కూర్చోబెట్టి బుక్కులు ఇచ్చి మరీ రాయిస్తున్నారు. అక్కడికి వెళ్లిన మీడియాపై ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తించారు. 'మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి. ఎలా మేనేజ్ చేసుకోవాలో నాకు తెలుసు' అంటూ మండిపడ్డారు. ఎంపీ మిథున్ రెడ్డి అండదండలు మాకు ఉన్నాయని, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని ధీమాగా సమాధానం ఇచ్చారు. అయితే ఈ పరీక్షలు ఎస్వీ యూనివర్సిటీ అధికారుల సమక్షంలో నిర్వహించాల్సి ఉండగా వారు ఎవరూ లేకపోగా 'స్థానిక' సిబ్బందే పరీక్షలు నిర్వహించడం శోచనీయం.



కళాశాల గేటుకు తాళాలు వేసి మరీ...

శభాష్ సింగ్

రైల్వేకు రూ.1.27 కోట్ల ఆదాయం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మీరు రేణిగుంట మార్గంలో రైలులో వెళ్లి ఉంటే ఈ అధికారిని మీరు తప్పక చూసి ఉంటారు.. ఆయనే చెకింగ్ స్క్వాడ్ సిబ్బంది ఉదయ్‌రామ్ సింగ్.. నిబంధనలు పాటించలేదని 2022, జనవరి నుంచి నేటి వరకూ 17321 చలానాలు రాశారు. వారి నుంచి 1.27 కోట్ల రూపాయల జరిమానాలను వసూలు చేసి రైల్వేకు ఆదాయాన్ని సమకూర్చి రికార్డు సృష్టించారు. సహజంగా చెకింగ్ స్క్వాడ్‌కు అంతో ఇంతో డబ్బులిస్తే సరిపోతుంది, నిబంధనలు చూసీచూడకుండా వెళ్లిపోతారన్న 'నమ్మకం' రైల్వే ప్రయాణికుల్లో ఉంది. అడపాదడపా అలాంటి అధికారులూ మనకు తారసపడుతూనే ఉంటారు. కాని 'సింగ్' అలా కాదు. నిబంధనల్లో ఖచ్చితత్వం పాటిస్తారు. అక్రమ టికెట్లతో అనధికారిక ప్రయాణాన్ని అరికట్టడానికి, నిజాయితీగల రైలు వినియోగదారులకు ఏదైనా అసౌకర్యాన్ని తగ్గించడానికి గుంతకల్ డివిజనల్ మేనేజర్ ఆదేశాల మేరకు తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరంతరం ఇంటెన్సివ్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌లను నిర్వహిస్తోంది. జి.ఉదయ్‌రామ్ సింగ్ చీఫ్‌ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.27 కోట్ల రూపాయలను జరిమానాల రూపంలో రైల్వేకు ఆదాయాన్ని సమకూర్చి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. 2020లో సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అవార్డును, 2022లో సౌత్‌సెంట్రల్ రైల్వే కమర్షియల్ మేనేజర్ అవార్డును అందుకున్నారు. నిజమైన రైలు ప్రయాణికులలో విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడే కీలకమైన మెకానిజమ్‌లో టికెట్ చెకింగ్ ఒకటి. రైల్వే ప్రయాణికులందరూ చెల్లుబాటు అయ్యే రైల్వే టికెట్లతో ప్రయాణించాలని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పల సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదర్శంతమైన పనితీరు, అంకితభావంతో పనిచేస్తున్న జి.ఉదయ్‌రామ్ సింగ్‌ను తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, ఏరియా సుబ్రమణ్యం ఆనంద్, సిటిటిఐ టి.రాగవేంద్ర, ఈశ్వర్, గిరి అమర్నాథ్‌రెడ్డి, దశరథలు అభినందించారు.

జెఎన్టీయూ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో ఎస్వీసీఈ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గత వారం ప్రొద్దుటూరు వాగ్దేవి ఇన్స్ టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన జేఎన్టీయూ స్పోర్ట్స్ ఫెస్ట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయ కేతనం ఎగురు వేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో సుధాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడల్లో రాణించిన వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునే అవకాశాలు ఉంటాయని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆరోగ్యాన్ని కూడా కలిగిస్తాయన్నారు. వ్యాయామశిక్షకులు కిషోర్ నాయక్, చెన్నయ్య, పార్వతి, విజయలక్ష్మి మోహన్ బాబు విద్యార్థులకు



క్రీడల పట్ల మంచి తర్ఫీదు అందించి విద్యార్థుల విజయానికి కీలకమయ్యారన్నారు. కళాశాల యాజమాన్యం క్రీడల కోసం తగిన వసతులు సౌకర్యాలను ఏర్పాటు చేయడంతోనే ఇలాంటి పోటీల్లో విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఏ.గంగిరెడ్డి, వైస్ చైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజలు మార్పు కోరుతున్నారు : జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుతున్నారని విషయం శాసనమండలి ఎన్నికల ద్వారా తేటతెల్లమైందని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్చార్జి కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మాట్లాడుతూ వై నాట్ 175 అన్న జగన్ ఇప్పుడు ఎన్నికలకు సిద్ధమా అని ప్రశ్నించారు. శాసనమండలి ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ తిరుపతిలో అత్యధికంగా దొంగ ఓట్లు వేయించారని, అయినా పట్టబద్రులు ప్రతిపక్షానికే పట్టం కట్టారన్నారు. చదువు చెప్పించుకున్న వారు తమ ఓటు రూపంలో వైసిపిపై వ్యతిరేకతను కనబరిచారని, చదువు చెప్పినవారు అధికార పార్టీకి దాసోహం అయ్యారన్నారు. రాష్ట్ర ప్రజల్లో మార్పు మొదలైందని, రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను బలపరిచే నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలే జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించి టిడిపి అభ్యర్థి విజయానికి కారకులయ్యారని, దీన్నిబట్టి చూస్తే సొంత పార్టీ ఎమ్మెల్యేలు జగన్ ను విశ్వసించడం లేదని స్పష్టమవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి పార్టీ గల్లంతు అవడం ఖాయమని జోస్యం చెప్పారు. పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేదనారాయణస్వామి ఆలయంలో సూర్యపూజోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నాగలాపురం శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామివారి ఆలయంలో శుక్రవారం వార్షిక సూర్యపూజోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహావిష్ణువు మత్స్యావతార రూపంలో సంవత్సరాల కొద్దీ యుద్ధం చేసి వచ్చినందున, స్వామి దివ్య శరీరానికి వెచ్చదనం కలిగించేందుకు సూర్య భగవానుడు తన కిరణాలను స్వామివారి మీద ప్రసరింపచేయడమే సూర్యపూజోత్సవం. ఈ ఉత్సవంలో ప్రధాన రాజగోపురం నుండి 630 అడుగుల దూరంలో గల మూలవిరాట్టుపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరిస్తాయి. మొదటి రోజు స్వామివారి పాదాలపై, రెండో రోజు నాభిపైన, మూడో రోజు స్వామి శిరస్సుపై సూర్యకిరణాలు ప్రసరించి స్వామి దివ్యరూపాన్ని మరింత తేజోవంతం చేస్తాయి. ఇందులో భాగంగా, శ్రీ వేద నారాయణ స్వామి వారికి శుక్రవారం మత్స్య జయంతి ఉత్సవం నిర్వహించారు. మార్చి 28వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజైన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేదనారాయణస్వామివారు దర్శనమిస్తారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరిండెంట్ ఏకాంబరం పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

క్షయవ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లాలో దాదాపు వందశాతం వైద్య పరీక్షలు నిర్వహించామని, వైద్యచికిత్సలు అందించి 95 శాతం మందికి నయం చేశామని, ఆరు నెలలకు సరిపడా పోషకాహార వస్తువులు అందించామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చెప్పారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా రుయా ఆస్పత్రి నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు అధికంగా ఉన్నవారికి హెచ్ఐవి పరీక్షలూ 98 శాతం పూర్తి చేశామని, మందులు అందిస్తున్నామన్నారు. లక్షణాలు తక్కువగా, మధ్యంతరంగా ఉన్నవారికి చికిత్స అందించి ఆరు నెలల్లో నయం అయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. లక్షణాలు ఎక్కువగా ఉంటే నయం కావడానికి రెండేళ్లు పడుతుందన్నారు. వీరికి అవసరమైన పోషకాహార వస్తువులను స్వచ్ఛందసంస్థలు, సిఎస్ఆర్ ఫండ్స్‌తో రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్నామన్నారు. క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో క్షయవ్యాధి యూనిట్లు తిరుపతి, చంద్రగిరి, పుత్తూరు, రేణిగుంట, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, కోట, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో అందుబాటులో ఉన్నాయని, క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తిగా ఉచితమని తెలిపారు. గత ఏప్రిల్ మాసం నుండి నిర్వహించిన పరీక్షలలో గుర్తించిన 5729 మంది వ్యాదిగ్రస్తులకు గాను 5268 మందికి వైద్య చికిత్సలు అందించి, 5261 మందికి హెచ్.ఐ.వి. పరీక్షలూ



నిర్వహించామన్నారు. ఇందులో 4916 మంది పూర్తిగా స్వస్థత పొందారు. మిగిలిన వారికి వైద్య చికిత్సలు, నిత్యావసర వస్తువులను అందించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ శ్రీహరి, జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ అరుణ సులోచనదేవి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ హనుమంతరావు, ఎస్‌వి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ నాగ మునీంద్రుడు పాల్గొన్నారు. తిరుపతి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు భీమినేని మునికృష్ణనాయుడు ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు టీబీ వ్యాధిమీద ఎస్సేరైటింగ్ కాంపిటీషన్ నిర్వహించి, విజేతలకు లయన్స్‌క్లబ్ తరపున బహుమతులను ప్రదానం చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ ముబారక్ బాషా పాల్గొన్నారు.

పిచ్చాటూరులో.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. టీబీ జబ్బు ముఖ్యంగా పిల్లల్లో కనిపిస్తుందని, వ్యాధిగ్రస్తుడు తప్పనిసరిగా మాస్క్ వేసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు మందులు, ఉచిత ఆహార కిట్లు అందజేస్తున్నామన్నారు. ఆరు నెలల తరువాత నెలకు 500 చొప్పున రోగి అకౌంట్‌లో జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, శాంతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సత్యవేడులో... దాసుకుప్పం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి రమేష్, వైద్యులు సురేష్, విద్యాసాగర్, మానస, చంద్రన్ పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో.. పిహెచ్‌సి సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'చేయి చేయి కలుపుదాం.. టీబీని నిర్మూలిద్దాం' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపూర్ణమ్మ, పిహెచ్‌ఎస్ పద్మావతి, హెల్త్ విజిటర్ మైథిలి పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో.. వైద్యాధికారి కె.మాధవిలత, పివి దివాకర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్ సహకారంతో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఎఎన్‌ఎం రత్నమ్మ, ఆశా వర్కర్లు గౌరి, పద్మావతి పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు పుస్తక సామగ్రి వితరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చిన్నబజార్ వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి 7 హిల్స్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, అట్టలు, నోట్ బుక్స్, పెన్స్ మెదలైన వస్తు సామాగ్రిని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాధం నేతత్వంలో పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 37వ వార్డ్ కార్పొరేటర్ బస్వా గీతా విచ్చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బస్వా గీతా మాట్లాడుతూ తాను ఈ స్కూల్ విద్యార్థినని, తాను కార్పొరేటర్ ఉన్న వార్డులో తాను చదివిన బాలికల ఉన్నత పాఠశాల ఉండటం తన అదష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులూ అన్ని రంగాల్లో విజయపథంలో నడవాలని సూచించారు. కోశాధికారి బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు

నేడు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత జమ : కలెక్టర్

తిరుపతి టౌన్: వై.యస్.ఆర్ ఆసరా మూడవ విడత రాష్ట్ర వ్యాప్తంగా 7.98 లక్షల మహిళా సంఘాలలోని 78.94 లక్షల అక్క చెల్లెమ్మలకు లబ్ది చేకూరేలా రూ.6,419.89 కోట్లు నేరుగా మహిళా సంఘాల పొదుపు ఖాతాలలో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నుండి బటన్ నొక్కి జమ చేయనున్నారని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలోని 33,757 పొదుపు సంఘాలలోని 3,18,992 మందికి రూ.300.53 కోట్లు లబ్ది కలగనున్నదని తెలిపారు. కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నామని తెలిపారు.

నేడు తిరుపతి కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్ తిరుపతి నగరపాలకసంస్థ 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశాలు శనివారం ఉదయం 9 గంటలకు ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో జరగనుంది. కౌన్సిల్ ప్రత్యేక ఆహ్వానితులు, తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర రెడ్డి, మేయరు డాక్టర్ శిరీష, కమీషనరు అనుపమ అంజలి, డిప్యూటి మేయర్లు భూమన అభినయ రెడ్డి, ముద్ర నారాయణ పాల్గొంటారు.

మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట మున్సిపల్ కార్మికులు చాలాకాలము నుండి ఈయస్ఐ చందా కడుతున్నా, ఉద్యోగులకు రాష్ట్ర బీమా చట్టము సర్వీసు అందుబాటులోకి రాలేదనీ సిఐటియూ నాయకులు సుధాకర్ రావు తెలిపారు. మున్సిపల్ కమీషనర్ నరేంద్రకుమార్ చొరవ తీసుకొని 120 మంది కార్మికులకు తాత్కాలిక ఇఎస్ఐ కార్డులు ఏర్పాటు చేసినందుకు కార్మికులు వారికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ కార్మికునికి, అతనిమీద ఆధారపడి కుటుంబ సభ్యులకు వైద్యం, వేతనం కూడిన చికిత్స, మహిళా కార్మికులకు మూడు నెలల ప్రసూతి సెలవులు, అశువులు బాసిన వారికి పదివేలు 'గుంట' ఖర్చులు చెల్లింపు ఏర్పాటు ఉందన్నారు.

'బసవతారక' పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

బసవతారక మహిళా సమైక్య తరఫున మహిళా దినోత్సవ వేడుకలు అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బసవతారక మహిళ సమైక్య కి ముఖ్యఅతిథిగా నగర డిప్యూటీ మేయర్ భూమన్ అభినయ్ రెడ్డి విచ్చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కొనియాడారు. భర్త చనిపోయిన ముగ్గురు మహిళా వితంతువులకు కస్తూరి గాంధీ భాయ్ ట్రస్టు డాక్టర్ వైఎస్ఆర్ ప్రజాప్రస్థాన చైర్మన్ డాక్టర్ పి.సి.రాయల్ 10వేల వంతున సాయం అందించారు. పారిశుధ్య మహిళా కార్మికులను భూమన అభినయ్‌రెడ్డి పసుపు కుంకుమలతో, పాదాలకు పాలాభిషేకం చేసి చీరలు పంపిణీ చేశారు. డ్వాక్రా సభ్యులందరికీ అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా కేతం జయచంద్రారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, కార్పొరేటర్ ముని రామిరెడ్డి, కార్పొరేటర్ దూది కుమారి, ఆర్‌పి శివలక్ష్మి పాల్గన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: భవాని శంకరాపురం దళితవాడలో టీడీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీంతో శుక్రవారం అధికారుల సమక్షంలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సర్పంచ్ చింతా రాజయ్య, చింతా గురవయ్య , చింతామణి, కోబాకు సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని మహిళలకు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నగదు జమ చేసినందుకు మండలంలోని మహిళలు జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పల్లమాల సర్పంచ్ రమణమ్మ, తిరుపతి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను వాయిదా లేకుండా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా అమలు చేయడం మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో పల్లమాల పంచాయతీ మహిళలు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి-నాయుడుపేట: మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన అభిమానులు నాయుడుపేట పట్టణంలోని చేయూత అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 27న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా 7 రోజులపాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం నాయుడుపేటలోని చేయూత ఆశ్రమం లో అన్నదానం కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాంచరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అబ్బాస్, మండలాధ్యక్షుడు జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బురకాల లీలా మోహన్, చిరంజీవి యువత అధ్యక్షుడు శెట్టిపల్లి యశ్వంత్ కుమార్, సాయిధరమ్ తేజ్, యువత పట్టణ అధ్యక్షుడు ముస్తఫ, మెగాభిమానులు షేక్ గౌస్, జహీర్, ఇస్మాయిల్, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : ఈనెల 27న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణంలో ముందస్తుగా శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత, గూడూరు జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు నయీమ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ రామ్‌చరణ్ యువత అధ్యక్షుడు చందు , నవీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



ప్రజాశక్తి-కోట: ప్రతి విద్యార్థికి చదువుతోపాటు సృజనాత్మకత చాలా అవసరమని శ్రీ ప్రగతి విద్యా సంస్థల కరస్పాండెంట్ పసుపులేటి. కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో బాలోత్సవ్ 2కే 23 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, క్విజ్, స్పెల్ బీ, పాటలు, నృత్యం, క్రీడాపోటీలు నిర్వహించారు. విద్యార్థులందరూ చాలా చక్కగా తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చదువుతో పాటు వివిధ రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

'పది' విద్యార్థులకు సందేహాల నివృత్తి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ఏప్రిల్ 3 నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మండల కేంద్రంలోని స్థానిక బాలుర వసతి గృహంలో తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి తెలుగు సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులకు కలిగే సందేహాలతో పాటు ప్రశ్న పత్ర విశ్లేషణ, భాషాంశాలు, వ్యాకరణానికి సంబంధించిన విషయాలను రాత్రి 7.30 నుంచి 9.30 వరకు తెలిపారు. వీటితో పాటు మాతృభాష తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించడానికి ఉపయోగపడే మెలకువలు నేర్పించారని వార్డెన్ రామయ్య తెలిపారు. వసతి గృహంలో ఉంటూ ఈ ఏడాది 23 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని.. అన్ని సబ్జెక్టులలో విషయ నిపుణులతో విద్యార్థులకు సందేహాలు తీర్చడం జరుగుతోందని తెలిపారు.


నాగలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సునంద పద్మనాభం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: నాగలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఊరందూరు సునంద పద్మ నాభంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సునంద పద్మనాభం, వైస్ ఛైర్మన్ గా ఆనందరెడ్డి, సభ్యులుగా నలిని సుబ్రహ్మణ్యం, వేదవల్లి, పరంధామయ్య, జయరాణి, వంశీకృష్ణారెడ్డి, అలగేశన్, షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, గురవమ్మ, బుజ్జి, మోహన్, యువరాజు, మోహన, సింగిల్ విండో ఛైర్మన్, అపరంజి రాజు, ఏడీఏ రమేష్ రెడ్డి, సర్పంచ్ చిన్నదొరై సుధ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సునంద పద్మనాభం మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేసి రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తెస్తామని తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన

- తితిదే జేఈవో సదా భార్గవి
- ఘనంగా ఎస్వీ ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం



ప్రజాశక్తి-తిరుమల: తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు జేఈవో సదా భార్గవి అన్నారు. శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తిరుమల ఎస్వీ హైస్కూల్ ఓ విద్యార్థి, ఉపాధ్యాయుడితో ప్రారంభమై ప్రస్తుతం 25 మంది ఉపాధ్యాయులు, 675 మంది విద్యార్థులు పాఠశాలలో ఉన్నట్లు తెలిపారు. టిటిడి ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్వీ ఉన్నత పాఠశాలను సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు సహకారంతో రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యున్నతమైన విద్యాసంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. చెన్నై ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం టెక్నాలజీ పరంగా సూపర్ పవర్‌గా అవతరిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. విద్యాశాఖ అధికారి డా.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. సులోచనా దేవి సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో టిటిడిలోని మరిన్ని విద్యాసంస్థల్లో శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, వార్షిక నివేదికను వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రేమండ్స్ వైస్ ప్రెసిడెంట్ సంజీవి సారిన్, సింఘానియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్, వీజీవో బాలిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ విజయంతో పుత్తూరులో సంబరాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో పట్టణంలోని స్థానిక కార్వేటినగరం కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలతో నివాళులు అర్పించారు. నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు అనురాధ మెజార్టీతో విజయం సాధించడంతో టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, జిల్లా పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ రావిళ్ల మాధవ నాయుడు, పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజానీకంలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏపీలో వైసీపీ పనైపోయిందని, ఇక జగన్‌ను ఎవరూ నమ్మరని.. మొన్నటి గ్రాడ్యుయేట్ ఎన్నికలు, నేడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేలిపోయిందని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పంచుమర్తి అనురాధకు శుభాకాంక్షలని.. మొన్నటి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మూడు ప్రాంతాల్లో క్లీన్ స్వీప్ చేసిన టీడీపీతో ఇక ఏపీలో వైసీపీ పనైపోయిందన్నారు. ఇక జగన్‌ను నమ్మే పరిస్థితి లేదని..సొంత పార్టీ ఎమ్మెల్యేలే జగన్‌ను నమ్మలేదని.. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీకి అవకాశాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రాభివద్ధి కోరుకునే వాళ్లు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని.. వైసీపీ ఇంటికెళ్లడం ఖాయమని వివరించారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే..!

ప్రజాశక్తి-గూడూరు: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని వైసీపీ ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తూ 23 ఓట్లతో టీడీపీ అభ్యర్థి అనురాధ పంచుమర్తి ఎమ్మెల్సీగా విజయం సాధించడం అభినందనీయమని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయాల్లో పెద్దపీట వేసేది తెలుగుదేశం పార్టీయే అని మరోసారి రుజువు అయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని, వైసీపీ ఎమ్మెల్యేలే సీఎం జగన్‌పై అసహనం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కావడం ఖాయమన్నారు. ఇందుకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు తెదేపా గెలుపునకు శుభారంభమని వివరించారు.

పిల్లలు తల్లిదండ్రులను పూజించాలి



ప్రజాశక్తి-కోట: శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమాన్నిఏజీఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ వెంకటసుధీర్ మాట్లాడుతూ ఆది గురువైన తల్లిని గౌరవించే మన భారతీయ సంస్కృతిని విద్యార్థులు కాపాడాలని సూచించారు. విద్యార్థి సర్వతోముఖాభివద్ధికి తోడ్పడే మానవీయ విలువలను గౌరవించడం తల్లిదండ్రుల నుంచే అలవడుతాయన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల డీన్ శివయ్య, కో-ఆర్డినేటర్ హిమబిందు ఠాగూర్, హరిత, వినీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక చర్యలు



ప్రజాశక్తి- వరదయ్యపాలెం: తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి అధ్యక్షతన జిల్లాలోని గూడూరు, నాయుడుపేట, శ్రీసిటీ సబ్‌డివిజన్‌ల పోలీసు అధికారులతో శ్రీసిటీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ ప్రాంతంలో నేరాలు, శాంతిభద్రతలు, విజిలెన్స్‌పై ఎస్పీ సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో నేర నిరోధక తనిఖీలు నిర్వహించాలని, వివిధ ముఠాల చుట్టూ ఉచ్చు బిగించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులు, తాజా ఫిర్యాదులు, పెండింగ్ విచారణలు, నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు, నోటీసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై సకాలంలో కోర్టు ఆదేశాలు అమలయ్యేలా, నోటీసులు అందేలా చూడాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అధికారులకు సూచనలు చేస్తూ ఫిర్యాదులతో పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే వారితో మంచిగా ప్రవర్తించాలని కోరారు. అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ మద్యం వ్యాపారం, మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలని, అవసరమని భావించిన ప్రాంతాలలో బీట్‌ల పునర్వ్యవస్థీకరణ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు (అడ్మిన్), బిహెచ్ విమలకుమారి (నేర విభాగం), డీఎస్పీలు సురేంద్ర రెడ్డి (స్పెషల్ బ్రాంచ్), జగదీష్ నాయక్ (శ్రీసిటీ), పలువురు సీఐలు, ఎస్సై లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-డక్కిలి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రతిఒక్కరూ పర్యవేక్షించాలని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషకరంగా ఉన్నారని.. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డక్కిలి మండలంలోని మోపుర పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పెద్దపేట సంక్షేమమని.. ఆ సంక్షేమంపై వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, మండల జేసీఎస్ కన్వీనర్లు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



ప్రజాశక్తి-కోట: బాలింతలు, గర్భిణులు అధిక శక్తినిచ్చే పోషకాలను ఆహారంగా తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు కోమది, సునీత సూచించారు. శుక్రవారం చెందోడు అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనత, బరువు, పౌష్టికాహార లోపాలను నివారించేందుకు 0-6 సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించి వాటి వినియోగాన్ని వివరించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఇనయతుల్లా పనిచేస్తూ గత సంవత్సరం జూన్‌లో గుండెపోటుతో చనిపోయాడు. ఉపాధి హామీ పథకం నుంచి రూ.5 లక్షలు డెత్ కాంపెన్సేషన్‌ను ముగ్గురు పిల్లల పేరుపై శుక్రవారం ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి చెక్కులు అందించారు. సర్పంచులు మనోహర్, మునిరామ్, దేవప్రసాద్, మహేందర్ రెడ్డి, ఏపీవో మృత్యుంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతో పరీక్షల్లో విజయం

ప్రజాశక్తి-రేణిగుంట: ఆర్.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆవుల ముని వెంకటరామిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ధర్మారెడ్డి, బొబ్బిలి రెడ్డి, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు హాజరై మాట్లాడారు. విద్యార్థులు భయపడకుండా మానసిక ఆరోగ్యాన్ని పొందాలని.. అప్పుడే విజయం సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, బాలసుబ్రహ్మణ్యం, స్వామి మహదేవ, రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను యథావిధిగా పనిలో చేర్చుకోవాలి

ప్రజాశక్తి- రేణిగుంట: సీఆర్ఎస్ కొత్త కాంట్రాక్టర్ నిలిపేసిన సీఆర్ఎస్ హౌస్ కీపింగ్ క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకోవాలని వర్క్‌షాప్ మేనేజరుకు శుక్రవారం సీఐటీయూ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 15 ఏళ్లగా పనిచేస్తున్న మహిళా కాంట్రాక్టు కార్మికులను ఏ విధమైన సమాచారం లేకుండా నిలిపివేయడం చాలా దారుణమని.. గతంలో 80 మంది మహిళా కార్మికులు పనిచేస్తుండగా.. 50 మందికి తగ్గించడంతో వర్క్ షాప్‌లో పనిచేస్తున్న వారికి పనిభారం ఎక్కువైందని తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, కార్మికులు అమ్ములు, చంద్రకళ, మునెమ్మ పాల్గొన్నారు.

'క్రాఫ్ట్ విలేజ్' త్వరగా పూర్తి చేయండి : ఎంపి


ప్రజాశక్తి - క్యాంపస్

జౌళి మంత్రిత్వ శాఖ 2016-17 ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లాలో రూ.955.00 లక్షలతో "క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు"ని మంజూరు చేసిందని, జిల్లాల పునర్విభజన జరగక ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి అంతర్భాగంగా ఉన్నపుడు డిఆర్‌డిఏ మొదటి విడతగా 50శాతం నిధులు రూ.477.50 లక్షలను మాత్రమే అందుకొందని చెప్పారు. గత 2 సంవత్సరాలుగా కోవిడ్-19 మహమ్మారిలో భూమి ఎంపిక, క్రాఫ్ట్ విలేజ్ నిర్మాణ కార్మికులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యల కారణంగా క్రాఫ్ట్ విలేజ్ ఆలస్యమైందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి తిరుపతి వారి లెక్కల ప్రకారం క్రాఫ్ట్ విలేజ్ కోసం రూ.516.45 లక్షల పనులు పూర్తయ్యాయని చిత్తూరు జిల్లాలో భాగంగా ఉన్నప్పుడు కేటాయించిన నిధులకు సంబంధించి నిర్మించిన పనులకు చిత్రాలతో కూడిన పనుల పురోగతి నివేదిక సమర్పించబడిందని సభ దష్టికి తీసుకెళ్లారు. కావున తిరుపతిలో చేనేత వత్తిపై ఆధారపడి వారి జీవనోపాధికి ఉపయోగపడే క్రాఫ్ట్ విలేజ్‌ని పూర్తి చేయడానికి గడువును పొడిగించడం ద్వారా రెండవ విడత మొత్తాన్ని మంజూరు చేయాలని గౌరవ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థించారు.

వేలం వాయిదా

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పురపాలక సంఘానికి సంబంధించిన కూరగాయలు, చేపల మార్కెట్‌లో రుసుం వసూలు చేసే లీజు హక్కు కోసం శుక్రవారం జరగాల్సిన వేలం అనివార్య కారణాలతో వాయిదా పడిందని పురపాలక కమిషనర్ సాయినాథ్ తెలిపారు. ఈనెల 27న ఉదయం గూడూరు పురపాలక కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గాయం శ్రీనివాస్‌కు సత్కారం



ప్రజాశక్తి-కోట: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, వాకాడు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాయం శ్రీనివాసులను తిరుపతి జిల్లా వైసీపీ బీసీసెల్ నాయకుడు, మాజీ సర్పంచ్ మూర్తి ఆనందరావు శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆయనను సత్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు.

పర్యాటక పనులకు స్థల పరిశీలన



ప్రజాశక్తి-పిచ్చాటూరు: తుడా మంజూరు చేసిన రూ1.80 కోట్లతో చేపట్టనున్న అరణియార్ పర్యాటక అభివద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఇరిగేషన్ అధికారులు స్థల పరిశీలన చేశారు. శుక్రవారం ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ నేతత్వంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా అరణియార్ కట్టపై స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేతో చర్చించిన అనంతరం పది రోజుల్లో ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిధులతో వ్యూ టవర్, బోటింగ్ వంటి పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు లోకేశ్వర్ రెడ్డి, శివబాల, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సమైక్య పోరాటం



ప్రజాశక్తి-వాకాడు: వాకాడులోని స్వర్ణముఖి ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ బంగ్లాలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన వాకాడు తాలూకా అధ్యక్షుడు గాయం శ్రీనివాసులు పర్యవేక్షణలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు సమయం పెంచాలి




ప్రజాశక్తి- పిచ్చాటూరు: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 3 నెలలు గడువు పెంచాలని రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్ కార్యదర్శి సి.పధ్వీరాజ్, సత్యవేడు నియోజకవర్గ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు కె.సతీష్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా డిమాండ్ చేశారు. తెలుగుదేశం రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్ కమిటీ ఆదేశాల మేరకు పిచ్చాటూరు మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ఇచ్చిన 85 రోజుల సమయం తక్కువగా ఉందని వాపోయారు. గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కేవలం 85 రోజులే ఇచ్చారని, ఏడు పేపర్లు ప్రిపేర్ కావడానికి ఈ సమయం చాలదని పేర్కొన్నారు. కొత్తవారితోపాటు, ఉద్యోగాలు చేసుకుని గ్రూప్-1 రాసేవారికి ఈ అదనపు సమయం ప్రిపేర్ కావడానికి ఎంతో ఉపయోగపడుతుందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కష్ణమూర్తి నాయుడు శింబు, కమల్, పరమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గంజాయి స్వాధీనం



ప్రజాశక్తి-తిరుమల: తిరుపతి నుంచి తిరుమలకు తరుచూ అక్రమంగా గంజాయిను సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని టిటిడి భద్రత విభాగం పట్టుకున్నారు. టిటిడిలోని కాంట్రాక్ట్ ప్రాతిపాదికన పనిచేస్తున్న గంగాధరం అనే వ్యక్తి నుంచి 125 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. గత కొద్ది కాలంగా గంగాధరం తిరుమలకు గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో భద్రతా విభాగం అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గంగాధరంను విచారణ నిమిత్తం తిరుమల ఎస్ఈబీకి విజిలెన్స్ అధికారులు అప్పగించారు. తిరుమలలో గంజాయి దొరకడంపై తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ స్పందించారు. పవిత్రమైన తిరుమలలో గంజాయిని సరఫరా చేయడానికి ఓ అవకాశం ఇవ్వమని అడిగారా అంటూ నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు.

దళిత క్రిస్టియన్స్ బిల్లు చరిత్రాత్మకం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన దళిత క్రిస్టియన్లకు సంబంధించినటువంటి బిల్లు ఒక చారిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత క్రిస్టియన్స్ బిల్లును శాసనసభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించడం అభినందనీయం అన్నారు. ఒక దళిత కుటుంబంలో ఇద్దరు బిడ్డలు ఉండి ఒకరు అదే మతంలో ఉంటూ.. రెండోవాడు క్రైస్తవ్యాన్ని స్వీకరిస్తే రెండోబిడ్డకు రిజర్వేషన్ వర్తించదని తెలిపారు.